## క్లుప్తంగా

### స్థానిక సంస్థలే కీలకం

**తిరువూరురూరల్:** గ్రామీణాభివృద్ధి పథకాలు సత్ఫలితాలివ్వాలంటే గ్రామ పంచాయతీలే కీలకమని తిరువూరు ఎంపీపీ గద్దల భారతి అన్నారు. తిరువూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం మండలంలోని పంచాయతీ ఉప సర్పంచులకు, వార్డు సభ్యులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, ఆస్తి పన్నుల వసూలు తదితర అంశాలపై సభ్యులు అవగాహన కలిగి ఉండాలని భారతి సూచించారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. ఇన్చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఈఓపీఆర్డీ వెంకట రత్నం పాల్గొన్నారు.

### రైతుబజారులో రాయితీపై టమాటాల విక్రయం



**నూజివీడు:** పట్టణంలోని రైతుబజారులో గురువారం టమాటాలను కిలో రూ.50కి విక్రయించారు. బహిరంగ మార్కెట్లో టమాటా కిలో రూ.90 నుంచి రూ.100కు విక్రయిస్తుండటంతో ప్రజలకు భారంగా పరిణమించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రైతుబజారుకు రెండు క్వింటాళ్ల టమాటాలను సరఫరా చేసింది. వాటిని వినియోగదారులకు విక్రయించారు. రైతు బజారులోని దుకాణదారులు టమాటాలను విక్రయించలేదు.

# ఖాళీ కుర్చీలకు శిక్షణ!

- రిఫ్రెషర్ శిక్షణా తరగతులకు ప్రజాప్రతినిధులు డుమ్మా
- సచివాలయ సిబ్బందితోనే మమ అనిపించిన అధికారులు



శిక్షణా తరగతులకు అతి తక్కువగా ప్రజాప్రతినిధులు హాజరుకావడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

**జి.కొండూరు:** రాష్ట్రీయ గ్రామ స్వరాజ్య అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక కమ్యూనిటీ హాల్లో బుధవారం నుంచి జరుగుతున్న రిఫ్రెషర్ శిక్షణా తరగతులకు ప్రజాప్రతినిధుల నుంచి ఆదరణ కరువైంది. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఉప సర్పంచ్తో పాటు ఇద్దరు వార్డు సభ్యులు శిక్షణ తరగతులకు హాజరు కావాల్సి ఉంది. వీరికి పారిశుద్ధ్యం, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, జీపీడీపీ స్ట్రూట్నీ, స్ట్రీట్ లైటింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఈ శిక్షణా తరగతులకు కోర్సు డైరెక్టర్గా ఎంపీడీఓ బీవీ రామకృష్ణ నాయక్, అసిస్టెంట్ కోర్సు డైరెక్టర్గా విస్తరణాధికారి కె. శ్రీనివాసరావు వ్యవహరిస్తారు. శిక్షణా తరగతులకు జి.కొండూరు మండల పరిధిలోని 22 గ్రామ పంచాయతీల నుంచి 22 మంది ఉప సర్పంచ్లు, 44 మంది వార్డు సభ్యులు హాజరు కావాల్సి ఉంది. అయితే బుధవారం నిర్వహించిన శిక్షణా తరగతులకు 50 శాతం మంది ప్రజాప్రతినిధులు హాజరుకాగా, గురువారం నిర్వహించిన తరగతులకు పది మంది కూడా హాజరు కాలేదు. దీనితో చేసేది లేక సచివాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, ఖాళీ కుర్చీలకు శిక్షణ ఇచ్చి కార్యక్రమాన్ని మమ అనిపించారు. ప్రజా ప్రతినిధులను శిక్షణా తరగతులకు తీసుకురావడంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది చొరవ తీసుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని విమర్శలు వినవస్తున్నాయి.

## రేపు హంస వాహనంపై అమ్మవారి ఊరేగింపు

**నూజివీడు:** పట్టణంలోని కోటమహిషాసురమర్దిని అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయని ఆలయ కార్యనిర్వహణాధికారి అలివేణి శ్రీనాగలక్ష్మీదేవి గురువారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 12న విజయదశమి సందర్భంగా అమ్మవారిని హంస వాహనంలో ఊరేగిస్తామని చెప్పారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. శనివారం అమ్మవారికి శ్రీరాజరాజేశ్వరి దేవి అలంకారం చేస్తామన్నారు. రాత్రి ఎనిమిది గంటలకు పోలీసు అధికారులతో ఆయుధ పూజ ఉంటుందని, రాత్రి 10 గంటలకు పట్టణ వీధుల్లో హంస వాహనంపై అమ్మవారి ఊరేగింపు జరుగుతుందని వివరించారు. ఊరేగింపులో కోలాటం, కత్తిసాము, కర్రసాము, తీన్మార్, బేతాళ సెట్టు ఉంటాయన్నారు. మంత్రి కేపీ సారథి, ఎంపీ పి.మహేష్కుమార్, మున్సిపల్ చైర్పర్సన్ ఆర్.త్రివేణీదుర్గ పాల్గొంటారని చెప్పారు.





## ఈ-క్రాప్ నమోదు పరిశీలన



**తిరువూరు:** వ్యవసాయ శాఖ ఈ-క్రాప్ నమోదు చేసే విధానాన్ని తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కె. మాధురి గురువారం పరిశీలించారు. మండలంలోని చింతలపాడు, గానుగపాడు గ్రామాల పరిధిలోని రైతులను నేరుగా కలిసిన ఆర్డీఓ వారు సాగుచేస్తున్న పంటల వివరాలు, ఈ-క్రాప్లో నమోదైన వివరాలను తనిఖీ చేశారు. ఈ-క్రాప్ నమోదుకు వీఆర్వోలు, వీఆర్ఏలు, గ్రామ వ్యవసాయ సహాయకులు అందుబాటులో ఉండాలని, సకాలంలో ఈ-క్రాప్ నమోదు చేసి రైతులకు ప్రభుత్వపరమైన పథకాల ద్వారా లబ్ధి చేకూరేందుకు సహకరించాలని ఆర్డీఓ ఆదేశించారు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

**ఇబ్రహీంపట్నం:** కొండపల్లి బొడ్డురాయి సెంటర్లో ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు చేసిన అనంతరం చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## ఎన్నాళ్లకెన్నాళ్లకు!



**మైలవరం:** మైలవరం నియోజకవర్గం రెడ్డిగూడెం జెడ్పీ హైస్కూల్లో 1994–1995 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ కలయిక పాఠశాల ప్రాంగణంలో గురువారం జరిగింది. నాటి స్నేహితులను చూసి ఒకింత ఉద్వేగానికి గురయ్యారు. ఆత్మీయంగా పలకరించుకుంటూ క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. నాడు స్కూల్లో చేసిన అల్లరిని తలచుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా నాటి సైన్స్ ఉపాధ్యాయిని అనసూయమ్మను ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ 30 సంవత్సరాల తరువాత విద్యాబుద్ధులు నేర్పిన విద్యార్థులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

## హైదరాబాద్-నూజివీడు ప్రత్యేక బస్సుల ఏర్పాటు

**నూజివీడు:** దసరా ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఈ నెల 11 వరకు నాలుగు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని నూజివీడు డిపో అసిస్టెంట్ మేనేజర్ జి. రాంబాబు గురువారం తెలిపారు. రెగ్యులర్గా నడిచే తొమ్మిది బస్సులకు ఇవి అదనమని చెప్పారు. వీటిని జీడిమెట్ల, ఈసీఐఎల్, బీహెచ్ఈఎల్, మియాపూర్ల నుంచి నడుపుతున్నామన్నారు. వీటిలో మూడు సూపర్ లగ్జరీ సర్వీసులు కాగా, ఒకటి ఎక్స్ప్రెస్ అని వివరించారు. హైదరాబాద్ నుంచి నూజివీడుకు వచ్చిన వారంతా తిరిగి హైదరాబాద్ చేరేందుకు వీలుగా ఈ నెల 13, 14 తేదీల్లో ప్రస్తుతం నడిచే తొమ్మిది సర్వీసులు కాకుండా మరో ఐదు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. వీటిలో నాలుగు సూపర్ లగ్జరీ సర్వీసులు కాగా, ఒకటి ఎక్స్ప్రెస్ అని తెలిపారు. స్పెషల్ సర్వీసులపై అదనపు చార్జీలు వేయడం లేదని చెప్పారు. ఇంకా అవసరముంటే సర్వీసులు పెంచుతామన్నారు.

## మానసిక ఆరోగ్యం ప్రధానం

### సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసిం



**నూజివీడు:** మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే శారీరకంగా కూడా ఆరోగ్యంగా ఉంటామని, ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండాలంటే ఎప్పటి పనిని అప్పుడే పూర్తి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసిం అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ మానసిక ఆరోగ్యమనేది ఎంతో ప్రాముఖ్యమైనదన్నారు. మంచి సమతుల జీవితాన్ని గడిపేందుకు మానసిక, శారీరక ఆరోగ్యం ఎంతో అవసరమని చెప్పారు. మానసిక ఆరోగ్యం విలువను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి రోజూ అరగంట సేపైనా ప్రాణాయామం చేయాలని చెప్పారు. అనంతరం మెంటల్ హెల్త్కేర్ యాక్ట్ను వివరించారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. నరేంద్రసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచితం.. అపహాస్యం

- మండిపోతున్న ఇసుక ధర
- ట్రాక్టర్ ఇసుక రూ.7 వేలు
- గత ప్రభుత్వ హయాంలోనే నయమంటున్న ప్రజలు


ఇసుక దొరకక అధిక ధర పెట్టి స్థానికంగా దొరికే ఎర్ర ఇసుకను ఉపయోగిస్తున్న గృహ నిర్మాణదారు

నూజివీడు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తెచ్చామని ఆర్భాటంగా ప్రకటించినప్పటికీ అమలులో అది అపహాస్యమవుతోంది. ఎక్కడా ఇసుక ఉచితంగా దొరకడం లేదు. గత నెల రోజులుగా ఇసుక కొనుక్కుందామన్నా కూడా దొరకని పరిస్థితి నెలకొనడంతో భవన నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక అల్లాడుతున్నారు. గత ప్రభుత్వంలో అమలు చేసిన విధానమే కొంతమేరకు నయమని తాపీ కార్మికులు చెబుతున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల వారు ఇసుక కావాలంటే ఎన్టీఆర్ జిల్లాలోని పెండ్యాల, కీసర ఇసుక పాయింట్ల నుంచి బుక్ చేసుకోవాల్సి వస్తోంది. 20 టన్నుల లోడు ఆగిరిపల్లికి రావాలంటే రూ.20 వేలు అవుతోంది. ఇక నూజివీడుకు రూ.22 వేలకు, ముసునూరుకు రూ.24 వేలకు, చాట్రాయి మండలానికి వచ్చేసరికి రూ.27 వేలు చెల్లించాల్సి వస్తోంది. దీంతో భవన నిర్మాణాలను ప్రారంభించిన యజమానులు గత ప్రభుత్వంలోనే నయమని, ఈ ప్రభుత్వం ఉచిత ఇసుక అని ప్రకటించిందే గానీ ఎక్కడుందో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక ఆధార్ కార్డుపై రోజుకు 20 టన్నులు మాత్రమే తీసుకోవాలని పరిమితి విధించడంతో కిరాయి రూపంలో వినియోగదారులు నష్టపోతున్నారు. అదే 40 టన్నుల వరకు అనుమతిస్తే.. ఒకేసారి తోలించుకోవడం వల్ల కిరాయి తగ్గుతుందని చెబుతున్నారు.

## కొత్త నిర్మాణాలకు జంకుతున్న జనం

ఇసుక కొరత, ధర భారీగా ఉండటంతో కొత్తగా గృహాలు నిర్మించుకోవాలనుకునేవారు పనులు ప్రారంభించాలంటేనే భయపడుతున్నారు. గత ప్రభుత్వంలో పది టన్నుల ఇసుక రూ.11 వేలకు వచ్చేదని, ఇప్పుడు రూ.12 వేలు అవుతుండగా, బ్లాక్‌లో కొనాలంటే రూ.15 వేలు ఖర్చవుతోందని చెబుతున్నారు. బుకింగ్ సైట్ తెరిచిన 15 నిమిషాల్లోనే ఇసుక అయిపోయిందని క్లోజ్ అయిపోతోందని ఆవేదన చెందుతున్నారు.

## అక్రమార్కులకు అవకాశం..

ముసునూరు మండలంలో ఉన్న తమ్మిలేరు నుంచి ఇసుకను కొందరు అక్రమార్కులు ట్రాక్టర్లలో తీసుకొచ్చి అధిక ధరకు విక్రయిస్తున్నారు. నూజివీడు పట్టణానికి వచ్చేసరికి ట్రాక్టర్ ట్రక్కు రూ.7 వేలకు అమ్ముతున్నారు. ఇది కొద్దిగా ఎర్రగా ఉన్నప్పటికీ మధ్యలో నిలిచిపోయిన నిర్మాణాలను పూర్తి చేయడానికి తప్పనిసరి పరిస్థితిలో ధర ఎక్కువైనా వినియోగదారులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. మధ్య తరగతి, పేద వర్గాలకు చెందినవారైతే అధిక ధరలను తట్టుకోలేక నిర్మాణాలను నిలిపివేశారు. ఇసుక కష్టాలు ఎప్పుడు తీరుతాయా అని ఎదురు చూస్తున్నారు.

### పనులు తగ్గాయి



ఇసుక కొరత, అధిక ధర కారణంగా పనులు తగ్గాయి. నా దగ్గర 8 మంది వర్కర్లు పనిచేస్తున్నారు. వారికి ప్రస్తుతం పనులు చూపించలేకపోతున్నాను. గతంలో నెలలో 20 రోజులు కచ్చితంగా పనులు ఉండేవి. ఈ నెలలో పది రోజులు గడిచిపోయాయి. ఇప్పటికి ఒక్క రోజు మాత్రమే పని దొరికింది. – మరీదు సత్యనారాయణ, రాడ్ బెండింగ్ మేస్త్రి, ఎమ్మార్ అప్పారావు కాలనీ,

### కొత్త ఇళ్ల నిర్మాణాలు లేవు



ఇసుక కొరత, ఎక్కువ ధర వల్ల కొత్తగా ఇళ్ల నిర్మాణాలను ఎవరూ మొదలు పెట్టడం లేదు. దీంతో పనులు తగ్గిపోయాయి. ఇసుక ఉన్నప్పుడల్లా వెళ్లి ఉన్న ఇళ్లనే పూర్తి చేస్తున్నాం. ఇసుక ధర ఎక్కువగా ఉండటం, అందుబాటులో లేకపోవడంతో పనులు బాగా తగ్గిపోయాయి.
– పి.రాజు, తాపీ కార్మికుడు, నూజివీడు

### ట్రాక్టర్ ఇసుక రూ.7 వేలు



ట్రాక్టర్ ఇసుక రూ.7 వేలు పెట్టి కొనాల్సి వస్తోంది. ఇంటి నిర్మాణం మొదలు పెట్టినప్పుడు గతంలో టన్ను రూ.800లకు వచ్చేది. ఇప్పుడు రూ.1,000 వసూలు చేస్తున్నారు. ఒక ఆధార్ కార్డుకు 20 టన్నుల పరిమితిని పెంచాలి. 40 టన్నుల వరకు అవకాశమిస్తే కిరాయి కలిసి వస్తుంది.
– పంద్రంగి ఆంజనేయ వరప్రసాద్, నూజివీడు

## సీనియర్ విద్యార్థులు మార్గదర్శకులుగా ఉండాలి



పెనమలూరు: జూనియర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు మార్గదర్శకులుగా నిలవాలని ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ చైర్మన్, పారిశ్రామికవేత్త ధనేకుల రవీంద్రనాథ్‌ఠాగూర్ అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రవీంద్రనాథ్ ఠాగూర్ మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు సహ విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉండి సహకరించాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి మాట్లాడుతూ.. విద్యార్థులందరూ సమేకమై సాంకేతిక, సాంస్కృతిక అంశాలపై నైపుణ్యం సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో డైరెక్టర్ రవిప్రసాద్, సెక్రటరీ భవానీ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముస్తాబాదలో రైతుల ఆందోళన


ముస్తాబాదలో ఆందోళన చేస్తున్న రైతులు

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాద రైతులు గురువారం ఆందోళన నిర్వహించారు. రైల్వే లైన్‌కు గ్రావెల్ తోలుతున్న లారీలను అడ్డుకున్నారు. ముస్తాబాద రైల్వే లైన్ వెంట కొత్తగా నిర్మిస్తున్న ఆర్‌ఓబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి) వెంట గ్రామానికి చెందిన రైతాంగం పొలం సుమారుగా 1,500 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఆయకట్టు ఇటీవల వర్షాలకు ముంపునకు గురైంది. 2020లో రైల్వే అధికారులు ఈ ప్రాంతంలో ఆర్‌ఓబి నిర్మించాలని 35 ఎకరాల భూమిని రైతుల వద్ద తీసుకున్నారు. అయితే అప్పట్లో రైతులకు నష్టం లేకుండా నిర్మాణం ఉంటుందని పలు హామీలు ఇచ్చారని రైతులు చెప్పారు. కాగా ప్రస్తుతం రైల్వే సేకరించిన భూమిని మొత్తం రబ్బీసుతో 30 అడుగుల మేర ఎత్తుగా నిర్మిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్మాణాలతో దిగువకు వెళ్లే పరిస్థితి ఉండదన్నారు. ఎన్నిసార్లు అధికారులకు తెలిపినా పట్టించుకున్న దాఖలాలు లేవని, వారి పనులు చేసుకుంటూ పోతున్నారన్నారు. రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు అధికారులు జోక్యం చేసుకుని మురుగు నీరు, అధిక నీరు వెళ్లేందుకు పంట బోదె, దాంతో పాటు సర్వీస్ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. అప్పటి వరకూ పనులు నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆందోళనలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు పాలడుగు మల్లికార్జునరావు, రైతులు పాలడుగు రత్నారావు, హుస్సేన్, సాంబశివరావు, నాగేశ్వరరావు, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

నున్న(విజయవాడరూరల్): ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ, న్యూ రాజీవ్‌నగర్, పాయకాపురం ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పరిశోధన అధికారి డాక్టర్ ఏజేవీ సాయిప్రసాద్ అన్నారు. నున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జరిగిన ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయుర్వేద మొబైల్ హెల్త్ కేర్ షెడ్యూల్డ్ ప్రణాళికలో భాగంగా ప్రతి సోమ, గురువారాల్లో ఉచిత వైద్యశిబిరం జరుగుతుందన్నారు. చెడు కొలెస్ట్రాల్ పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయుర్వేద వైద్యం మంచి ఫలితాలను ఇస్తుందని వివరించారు.

## కానూరులో రేషన్ బియ్యం పట్టివేత

పెనమలూరు: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు తులసీనగర్ పవర్‌మాల్ వద్ద ఇంట్లో రేషన్ బియ్యం డంప్ ఉందన్న సమాచారంతో పోలీసులు బుధవారం రాత్రి దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 15 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సనత్‌నగర్ రేషన్ డిపోకు చెందిన ఎండీయూ వాహన డ్రైవర్ షేక్.మునాఫ్ రేషన్ లబ్ధిదారుల వద్ద తక్కువ ధరకు బియ్యం సేకరించి సనత్‌నగర్ డీలర్ సుధాకర్‌కు విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు.

## సమర్థంగా ఉపాధి కల్పన జరగాలి



కంకిపాడు: ఉపాధి కల్పన సమర్థంగా, పారదర్శకంగా జరగాలని డ్వామా పీడీ ఎస్‌వీ శివప్రసాద్ యాదవ్ ఆదేశించారు. కంకిపాడు మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకూ మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన రూ.8.85 కోట్ల ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించారు. గ్రామాల వారీగా ఉపాధి పనులకు సంబంధించి నివేదిక సమర్పించగా అధికారులు సమీక్ష జరిపారు. 1194 పనులకు సంబంధించి ఉపాధి పనుల నాణ్యతపై వివరాలు సేకరించారు. డ్వామా పీడీ శివప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ ఉపాధి నిధులు సద్వినియోగం అయ్యేలా చూడాలన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి చూపాలన్నారు. పనుల నిర్వహణ సమర్థంగా జరగాలని, లోపాలకు అవకాశం లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ ఎస్‌వీ నాంచారరావు, ఎంపీడీఓ పి.అనూష, అంబుడ్స్‌మెన్ కేవీ శ్రీనివాసరావు, డీవీఓ సురేష్, ఏపీఓ పాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

## కొండపల్లిలో వైద్య ఆరోగ్య శాఖాధికారుల పర్యటన



సాక్షి స్పందన

**కొండపల్లి(ఇబ్రహీంపట్నం):** కొండపల్లి మున్సిపాలిటీ ప్రాంతాల్లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు గురువారం పర్యటించారు. 'జ్వరాల విజృంభణ' శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి స్పందించిన డీఎంహెచ్ఓ మాచర్ల సుహాసిని, జిల్లా మలేరియా అధికారి మోతిబాబు, పీహెచ్‌సీ సబ్ యూనిట్ అధికారి అప్పారావు అనుమానాస్పద ప్రాంతాలను సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో ఆరోగ్య సిబ్బంది నిర్వహించిన సర్వే రిపోర్టులు, దోమల నివారణ చర్యల నివేదికను పరిశీలించారు. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎవరైనా జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతుంటే సమీపంలోని పీహెచ్‌సీలకు వెళ్లాలని సూచించారు. దోమ తెరలు వాడాలని, పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో ఆరోగ్య సిబ్బంది చేపట్టాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, పీహెచ్‌సీ డాక్టర్లు ఆర్.పద్మావతి, పర్వీన్, సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం దుకాణాల లాటరీ వేదిక మార్పు

**మైలవరం:** మద్యం దుకాణాల లాటరీ వేదికను మార్చారని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ జోశ్యుల శ్రీనివాస్ గురువారం తెలిపారు. మైలవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం మండలాల్లో నోటిఫై చేసిన 10 షాపులకు ఇప్పటి వరకు 400లకు పైగా దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. శుక్రవారం రాత్రి ఏడు గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లాలోని 113 షాపులకు విజయవాడ గురునానక్ నగర్‌లో ఈనెల 14వ తేదీన ఉదయం 8 గంటలకు లాటరీ తీస్తారని వివరించారు.

## సామూహిక కుంకుమార్చన



**వినగడప(గంపలగూడెం):** వినగడప పంచముఖ సుందర హనుమత్ పీఠంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి శిబిరంలో గురువారం అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అర్చకులు అరిపిరాల అప్పయ్యశాస్త్రి, పొద్దుటూరి కోటేశ్వరశర్మల ఆధ్వర్యంలో మహిళలు కుంకుమపూజ చేశారు.

## బతుకమ్మకు విశేష పూజలు



**గంపలగూడెం:** దసరా ఉత్సవాల్లో భాగంగా గంపలగూడెం రావిచెట్టు సమీపంలో గురువారం బతుకమ్మకు మహిళలు విశేష పూజలు నిర్వహించారు. నెలకొల్పిన బతుకమ్మ చుట్టూ మహిళలు చేరి సంప్రదాయబద్ధంగా పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ కోలాహలంగా పూజలు నిర్వహించారు. అమ్మవారికి పలు రకాల పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు.

## చైన్ స్నాచర్‌కు దేహశుద్ధి

**కొండపల్లి(ఇబ్రహీంపట్నం):** కొండపల్లిలో ఓ చైన్‌స్నాచర్ గురువారం హల్‌చల్ చేశాడు. స్థానిక కుమ్మరి బజార్‌లో నడుచుకుంటూ వెళుతున్న అన్నపూర్ణ అనే మహిళ మెడలో బంగారు నానుతాడు లాక్కుని పరారయ్యాడు. ఆమె కేకలు విన్న స్థానికులు చైన్ స్నాచర్‌ను వెంబడించి మెయిన్ బజార్‌లోని ఆరు పంపుల సెంటర్ వద్ద పట్టుకుని దేహశుద్ధి చేశారు. అతని వద్ద చైన్‌ను స్వాధీనం చేసుకుని బాధిత మహిళకు అప్పగించారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా అందరూ దుర్గమ్మ ఆలయం దసరా మహోత్సవాల విధుల్లో ఉన్నట్లు తెలుసుకుని వారే స్వయంగా నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి పోలీస్ సిబ్బందికి అప్పగించారు. బాధిత మహిళతో ఫిర్యాదు చేయించారు.

## 5 వేల మందికి అన్నదానం



**మధురానగర్(విజయవాడసెంట్రల్):** శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం దావు బుచ్చయ్యకాలనీ గ్రామదేవత శ్రీ శ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యాన 5వేల మందికి అన్నదానం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త చింతపల్లి కనకారావు పర్యవేక్షించారు.

# క్షణం క్షణం..భయం భయం

- శిథిలావస్థలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం
- కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనం
- బీటలు వారిన గోడలు, స్తంభాలు
- శ్లాబు నుంచి ఊడిపడుతున్న పెచ్చులు
- ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని విధులు నిర్వహిస్తున్న సిబ్బంది





శిథిలావస్థకు చేరిన జి.కొండూరు మండల ప్రజా పరిషత్ భవనం ; గోడలు, శ్లాబు పెచ్చులు ఊడి ప్రమాదకరంగా ఉన్న మండల ప్రజా పరిషత్ సమావేశపు హాలు

**జి.కొండూరు:** జి. కొండూరు మండల ప్రజా పరిషత్ భవనం శిథిలావస్థకు చేరింది. శ్లాబు పెచ్చులు ఊడి పడుతున్నాయి. స్తంభాలు, పిల్లర్ల పెచ్చులు ఊడి ఇనుప చువ్వలు కనిపిస్తున్నాయి. గోడలు బీటలు వారాయి. భవనం ఎప్పుడు కూలుతుందో కూడా తెలియక కార్యాలయంలో సిబ్బంది ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. మండల అభివృద్ధి అధికారి, మండల పరిషత్ అధ్యక్షులు ఉండే భవనానికే ఇలాంటి దుస్థితి ఉంటే ఇక ప్రజల సమస్యలు పరిష్కారం ఎలా జరుగుతుందనే విమర్శలు వస్తున్నారు.

### 23 ఏళ్లకే శిథిలావస్థకు..

జి.కొండూరు మండల ప్రజా పరిషత్ భవనానికి 1999లో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. 2001లో భవనాన్ని పూర్తి చేసి ప్రారంభించారు. అయితే 23 ఏళ్లకే ఈ భవనం శిథిలావస్థకు చేరింది. ఈ 23 ఏళ్లలో భవనానికి రెండుసార్లు మరమ్మతులు కూడా చేశారు. అయినప్పటికీ భవనం స్తంభాలు, శ్లాబు పెచ్చులు ఊడటంతో పాటు గోడలు పూర్తిగా నెర్రెలు విచ్చి ప్రమాదకరంగా భవనం దర్శనమిస్తోంది. ఈ భవనం కూడా పులివాగుకు పక్కనే ఉండటంతో ఇటీవల వచ్చిన వరదల ప్రభావానికి భవనంలోకి నీరు చేరి ఫర్నిచర్, రికార్డులు తడిచిపోయాయి. గోడలు సైతం వర్షానికి తడిచి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి.

### సమావేశాలన్నీ కమ్యూనిటీహాల్‌లోనే..

మండల ప్రజా పరిషత్ భవనంలో సమావేశాలు నిర్వహించే హాల్ పూర్తిగా ధ్వంసమైపోయి గోడలు, శ్లాబు పెచ్చులు ఊడి పడుతుండడంతో ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశాలను కొంతకాలంగా స్థానిక కమ్యూనిటీ హాల్‌లోనే జరుపుతున్నారు. సిబ్బంది సైతం ఈ భవనంలో విధులు నిర్వహించేందుకు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు.
కార్యాలయంలో ఉండే పది మంది సిబ్బందితో పాటు అన్ని శాఖల అధికారులు, ప్రజలు కార్యాలయానికి నిత్యం వచ్చి వెళుతుంటారు. ఏ క్షణాన్నైనా ఈ భవనం కూలితే తీవ్ర ప్రాణనష్టం వాటిల్లే అవకాశం ఉందని అధికారులు, ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.



స్తంభం, పిల్లర్ల పెచ్చులు ఊడి కనిపిస్తున్న ఇనుప చువ్వలు

### ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే భవనం నిర్మిస్తాం



మండల ప్రజా పరిషత్ భవనం పునర్నిర్మాణానికి సంవత్సరం కిందటే ప్రతిపాదనలు పంపాం. జిల్లా పరిషత్ సమావేశంలో కూడా భవనం పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరించాం. ఒకసారి స్థానిక ఎమ్మెల్యే కూడా భవనాన్ని పరిశీలించారు. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉంది. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే భవనాన్ని పునర్నిర్మించేందుకు వెంటనే చర్యలు చేపడతాం.

– వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, ఎంపీపీ, జి.కొండూరు




తిరువూరు అష్టలక్ష్మీ ఆలయంలో భద్రకాళి అలంకారం



తిరువూరు చంద్రమౌళీశ్వరాలయంలో అమ్మవారు



నెమలిలో ధనలక్ష్మి అలంకరణ



గుళ్లపూడిలో దుర్గాదేవిగా అమ్మవారు

# ఓం దుర్గాయై నమః

**మైలవరం:** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు మైలవరం, తిరువూరు, నూజివీడు నియోజకవర్గాల్లో వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. గురువారం అమ్మవార్లు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. దుర్గుణాలను జయించే శక్తిని ప్రతి ఒక్కరికీ ప్రసాదించాలని కోరుకుంటూ భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయాలు, చలువ పందిళ్ల వద్ద నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

**కనకదుర్గా దేవిగా..**

**విస్సన్నపేట:** స్థానిక ద్వారకా నగర్‌లోని కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని గురువారం కనక దుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. మండలంలోని పుట్రేల గ్రామంలో మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని కనక దుర్గాదేవిగా అలంకరించారు.

- **చాట్రాయి:** గురువారం పోతనపల్లి తండాలోని అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.
- **తిరువూరు:** తిరువూరులోని అష్టలక్ష్మి ఆలయంలో భద్రకాళిగా, రామలింగేశ్వరాలయం, కనకదుర్గాలయం, చంద్రమౌళీశ్వరాలయం, గౌరీ కేదారేశ్వరాలయం, కోదండ రామాలయం, ఆర్యవైశ్య కల్యాణ మండపం, షిర్డీసాయి మందిరం, సత్యసాయి మందిరాలలో అమ్మవార్లను కనక దుర్గమ్మగా అలంకరించారు. రంగనాయకస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మీ దేవిని 108 చీరలతో అలంకరించారు.
- **నూజివీడు:** పట్టణంలోని కోట మహిషాసుర మర్దిని అమ్మవారు గురువారం దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని జంక్షన్ రోడ్డులో ఉన్న సర్వసతీ ఆలయంలో, బస్టాండు వద్ద శివాలయంలో, 32వ వార్డులోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో, 5వ వార్డులోని గంగానమ్మ ఆలయంలో అమ్మవార్లను మహాలక్ష్మీ దేవిగా అలంకరించారు. పట్టణంలోని గంగానమ్మ అమ్మవారిని వైఎస్సార్ సీపీ యువ నాయకుడు చంటినాయన గురువారం దర్శించుకున్నారు. అనంతరం గంగానమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆలయ నిర్వాహకుడు మలిశెట్టి బాబి చంటి నాయనను సన్మానించారు.
- **ఆగిరిపల్లి:** స్థానిక రుద్రభూమి వద్ద కనక దుర్గమ్మవారి ఆలయంలో కుంకుమ పూజ, చండీ హోమం ఆలయ అర్చకుడు దేవులపల్లి శ్రీనివాస్ నిర్వహించారు. రజక వీధిలో, దమ్మన్న మండపంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహాలను దుర్గామాతగా అలంకరించి పూజలు చేశారు.
- **బలివే(ముసునూరు):** బలివేలోని బలే రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో రాజరాజేశ్వరి అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. గోపవరం కాశీ విశ్వేశ్వరాలయం, నాగేంద్రపురం, చెక్కపల్లి, వేల్పుచర్ల, రమణక్కపేటల్లోని శ్రీకోదండ రామాలయాల్లో, గుడిపాడు, వలసపల్లి శివాలయాల్లో, గోగులంపాడు గోగులమ్మ ఆలయం వద్ద అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. లోపూడిలోని కోదండ రామాలయం వద్ద అమ్మవారిని కనకదుర్గా దేవిగా అలంకరించి భవానీ మాలధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



విస్సన్నపేటలో కనకదుర్గాదేవిగా అమ్మవారి అలంకారం



పుట్రేల మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు



మైలవరంలో దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



తిరువూరు కనకదుర్గాలయంలో దుర్గాదేవి అలంకారం



కొణిజెర్లలో కనకదుర్గమ్మ అమ్మవారు



గంపలగూడెం రామాలయం సెంటర్ శిబిరంలో దుర్గాదేవి



వినగడప సుందర హనుమత్‌పీఠంలో కనకదుర్గమ్మగా..



దుర్గాదేవి అలంకరణలో కోట మహిషమ్మ



నూజివీడు శివాలయంలో శ్రీ దుర్గాదేవిగా అమ్మవారు



పోతనపల్లి తండాలో భక్తుల పూజలు



ఆగిరిపల్లి కనకదుర్గమ్మ ఆలయంలో ..



బలివేలో దుర్గాదేవిగా అమ్మవారు

## వీఎంసీ సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలి

**పటమట(విజయవాడతూర్పు):** దసరా ఉత్సవాలు ముగింపునకు చేరుకుంటున్నందున భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉందని, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో గురువారం ఆయా శాఖల అధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యానచంద్ర మాట్లాడుతూ భక్తుల తాకిడి నేపథ్యంలో గుడి పరిసరాలు, స్నానఘాట్లలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. క్యూలైన్లో భక్తులు వదిలేసిన వ్యర్థాలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని చెప్పారు. క్యూలైన్లో తాగునీటి ఏర్పాట్లలో ఎలాంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి పాయింట్లలో స్టాక్ ఉండేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు.

## విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

**వీరులపాడు:** సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆరు రాష్ట్రాల్లో 42 శాఖల ద్వారా రూ. 4,200 కోట్లకు పైగా వ్యాపారం సాగిస్తోందని ఎండీ కేవీ సుబ్బయ్య తెలిపారు. వీరులపాడు బ్రాంచ్ ఆధ్వర్యంలో పది, ఇంటర్ మీడియెట్‌లో 95 శాతం మార్కులు సాధించిన ఇరువురు షేర్ హోల్డర్స్ పిల్లలకు గురువారం ఆయన ప్రతిభా పురస్కారాలు, ఒక్కొక్కరికి రూ. 10 వేలు నగదు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో సభ్యులకు 18 శాతం డివిడెంట్ చెల్లించామన్నారు. 26 ఏళ్లుగా 10, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ పువ్వాడ శివకృష్ణ చైతన్య, చావా కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## వరద బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలి

వైఎస్సార్ సీపీ నేత సర్నాల తిరుపతిరావు



**మైలవరం:** ఇటీవల బుడమేరు, కృష్ణానది వరదలకు నష్టపోయిన బాధితులకు వెంటనే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని వైఎస్సార్ సీపీ నేత సర్నాల తిరుపతిరావు డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వరదలకు నష్టపోయిన బాధితులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ వద్ద ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం జరిగింది. సర్నాల తిరుపతిరావు పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రచార ఆర్భాటం కోసం పడవలు, బోట్‌లు, పొక్లెయిన్లు, ట్రాక్టర్లు, బుల్‌డోజర్లు ఎక్కి ఫొటోలు దిగి మళ్లీ బస్సులో పడుకోవడం తప్ప బాధితులకు సహాయం అందించింది లేదన్నారు. వరదలను అడ్డుపెట్టుకుని కోట్ల రూపాయల చందాలు వసూలు చేశారని విమర్శించారు. విరాళాలు వసూలు చేసిన దానిలో పావలా వంతు ఖర్చుపెట్టినా బాధితులకు న్యాయం జరిగి ఉండేదన్నారు.

## విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి



**హనుమాన్‌జంక్షన్ రూరల్:** ప్రమాదకరంగా మారిన పాత ఇనుప విద్యుత్ స్తంభాలు, లైన్లు, రాగి వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని ఏపీ సీపీడీసీఎల్ టెక్నికల్ అండ్ కన్‌స్ట్రక్షన్ డీఈ సుధాకర్‌కు రైతులు విజ్ఞప్తి చేశారు. బాపులపాడు మండలం వేలేరులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 5 మెగా వాట్స్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులను హనుమాన్‌జంక్షన్ ఏడీఈ బి.శ్రీనివాసరావు, వీరవల్లి ఏఈ యు.మురళీకృష్ణ కలిసి గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామానికి చెందిన రైతులతో విద్యుత్ అధికారులు సమావేశమయ్యారు. పలు విద్యుత్ సమస్యలను రైతాంగ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు నేతృత్వంలో డీఈ సుధాకర్‌కు వివరించారు. సమస్యలను విద్యుత్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, సత్వర పరిష్కారానికి చొరవ చూపుతానని డీఈ సుధాకర్ చెప్పారు.

## వైభవంగా జ్యోతుల మహోత్సవం



**మధురానగర్(విజయవాడసెంట్రల్):** అమ్మవారి దయ అందరికీ లభించాలని, ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు అన్నారు. స్థానిక విజయ దుర్గానగర్‌లో గురువారం శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జ్యోతుల మహోత్సవం వైభవంగా జరిగింది. విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ప్రతీ ఏటా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. అనంతరం భక్తులకు జ్యోతులను అందజేశారు. భక్తులు జ్యోతులతో దేవీ నగర్, మధురానగర్ తదితర ప్రాంతాల మీదుగా ఇంద్రకీలాద్రికి వెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మార్తి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



**కంకిపాడు:** అయ్యప్ప పడిపూజా మహోత్సవం వైభవంగా జరిగింది. మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో అయ్యప్ప మాలధారి పర్వతనేని రవి 18వ పడి సందర్భంగా గ్రామంలో బుధవారం రాత్రి పడిపూజ నిర్వహించారు. స్వర్ణకంకణ గ్రహీత కోసూరు శ్రీనివాసరావు, ఉప్పలూరు రాజా గురుస్వామి నేతృత్వంలో పడి పూజ, భక్తి గీతాలాపన జరిపించారు. మాలధారి పర్వతనేని రవి, శ్రీదుర్గ దంపతులు స్వామి వారికి విశేష పూజలు జరిపించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో అయ్యప్ప, భవానీ, శివ మాల ధారులు పాల్గొన్నారు.

## ట్రై సైకిల్ అందజేత

**వత్సవాయి:** పొట్టి శ్రీరాములు సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని లింగాల గ్రామానికి చెందిన వృద్ధురాలికి జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బొగ్గవరపు వెంకట రాజారావు గురువారం ట్రై సైకిల్‌ను అందజేశారు. లింగాల గ్రామానికి చెందిన పాలపాటి సక్కుబాయి నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ట్రై సైకిల్ కావాలని అడగడంతో పొట్టి శ్రీరాములు సేవా ట్రస్టు ద్వారా అందించినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు.